ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 20 జూన్ 2025

పాఠశాలల వేళల్లో భారీ వాహనాల నిషేధం

● చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ఉదయం, సాయంత్రం పాఠశాలల ప్రారంభం, ముగింపు సమయాల్లో భారీ వాహనాల సంచారంపై నిషేధం విధిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీచేశారు. స్థానిక పెరంబూర్‌లో బుధవారం ఉదయం 5వ తరగతి చదువుతున్న సౌమ్య (10) తల్లి యామినితో కలసి ద్విచక్రవాహనంపై స్కూల్‌కు వెళ్తూ నీటి ట్యాంకర్ కింద పడి దుర్మరణం పాలైన విషయం తెలసిందే. ఈ ఘటనపై స్పందించిన గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ప్రకారం, నగరంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నాం 12, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో భారీ వాహనాల సంచారంపై నిషేధం విధించారు. నిబంధనలు అతిక్రమించి ఆయా సమయాల్లో భారీ వాహనాలను అనుమతిస్తే ట్రాఫిక్ పోలీసులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ప్రమాదానికి కారణమైన వాహనాలను వంద రోజుల పాటు వాటి యజమానులకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. పాఠశాలల సమయాల్లో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తప్పకుండా విధుల్లో పాల్గొనాలని, విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వారికి తగిన సూచనలు ఇవ్వాలని కమిషనర్ ఉత్తర్వుల్లో తెలిపారు.



● సీఎం స్టాలిన్ సుదీర్ఘ ప్రకటన

పాండ్య రాజుల చరిత్రను పాతిపెడుతున్న కేంద్రం

అడయార్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా కీళడి పురావస్తు పరిశోధనల్లో బహిర్గతమైన తమిళ పాండ్య రాజుల వైభవం, తమిళ సంస్కృతి, గొప్పతనాన్ని కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ పాతిపెట్టేందుకు ప్రయత్నిస్తోందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆరోపించారు.ఈ విషయంపై ఆయన గురువారం ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కీళడిలో జరిగిన పురావస్తు తవ్వకాల్లో తమిళ నాగరికత ప్రత్యేకమైనదని, తమిళుల సంస్కృతి చాలా పురాతనమైనదని నిరూపించాయన్నారు. 2016సెప్టెంబరు 29న కరుణానిధి తన సోషల్ మీడియా ఖాతాలో కూడా 'కీళడి పురావస్తు తవ్వకాల్లో బయల్పడిన పురాతన కళాఖండాలు, భవనాలు క్రీస్తుపూర్వం మూడో శతాబ్దం నుంచి క్రీస్తు శకం పదో శతాబ్దం వరకు నివాసం ఉన్నట్టు నిరూపించాయన్నారు. ఈ భవనాలు చతురస్రాకారం, దీర్ఘచతురస్రాకారంలో ఉన్నాయని, భవనాలు దక్షిణం, ఉత్తరం వైపున ఎదురుగా నిర్మించినట్టు నిరూపణ అయిందన్నారు. ఇంటి నిర్మాణాల్లో రాగి, ఇనుప వంటివాటిని ఉపయోగించినట్టు గుర్తించారన్నారు. ఇప్పటివరకు జరిగిన తవ్వకాల్లో మొత్తం 5,300 వస్తువులు గుర్తించారని, సంఘ కాలంలో తమిళనాడులో పట్టణ నాగరికత లేదనే ఆలోచన తప్పని ఇది రుజువు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కీళడి పురావస్తు తవ్వకాల ఫలితాలను బహిర్గతం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం ఆసక్తి చూపించకపోగా ఈ తవ్వకాల్లో వెలుగు చూసిన తమిళ సంస్కృతి గొప్పతనాన్ని చరిత్రపుటలకు ఎక్కించకుండా పాతిపెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కీళడి తవ్వకాలు జరిగినపుడు అన్నాడీఎంకే అధికారంలో ఉందని, ఆ ఫలితాలను అంగీకరించేందుకు నిరాకరించిన బీజేపీ ప్రభుత్వ జాతి, మత విద్వేషంపై అన్నాడీఎంకే నోరు మెదపడం లేదని సీఎం స్టాలిన్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


గిండి కత్తిపారా జంక్షన్ వద్ద మాధవరం - చోళింగనల్లూరు మార్గంలో జరుగుతున్న మెట్రో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

ప్రగతి పథంలో
పారిశ్రామిక రంగం

● 'ఆక్మీ-2025' సభలో సీఎం స్టాలిన్


నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో 'ఆక్మీ-2025'లో స్టాల్స్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా డీఎంకే ద్రావిడ తరహా పాలనలో రాష్ట్రం పారిశ్రామిక రంగంలో ప్రగతిపథంలో పయనిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ (అయిమా) ఆధ్వర్యంలో స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో గురువారం ఉదయం 'ఆక్మీ-2025' అంతర్జాతీయ యంత్ర పరికరాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చిన్నమధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు తృతీయ స్థానంలో ఉందని, వీటి ద్వారా 2.47 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. డీఎంకే ద్రావిడ తరహా పాలనలో ఇప్పటివరకు కొత్త 14 పారిశ్రామిక వాడలు, కోవైలో కార్మికులు, సిబ్బందికి వసతిగృహాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మోటారు వాహనాలు, రెడీమేడ్ దుస్తులు, తోలువస్తువుల ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలలో 30 శాతం మహిళలు ఉన్న రాష్ట్రంగానూ కీర్తిగడించిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామో అన్బరసన్, ఎమ్మెల్యేలు ఇ.కరుణానిధి, జోసెఫ్‌సామువేల్, అదనపు ప్రభుత్వ కార్యదర్శి అతుల్ ఆనంద్, అయిమా అధ్యక్షుడు సతీష్ బాబు, గౌరవ ప్రధాన కార్యదర్శి తవమణి, ఆక్మీ-2025 ఛైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో 120 విదేశీ కంపెనీలు, 468 స్వదేశీ కంపెనీలకు చెందిన ఉత్పత్తులు, యాంత్ర పరికరాలతో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు.

మెట్రో రైల్ పనుల పరిశీలన...

గిండి కత్తిపారా జంక్షన్ వద్ద జరుగుతున్న మెట్రోరైలు నిర్మాణ పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ పరిశీలించారు. మంత్రి దామో అన్బరసన్, మెట్రోరైల్వేస్ ఉన్నతాధికారులతో కలిసి ఆయన కత్తిపారా ఫ్లైఓవర్ కంటే ఎత్తయిన ప్రాంతం లో జరుగుతున్న రైలు మార్గ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కత్తిపారా ఫ్లైఓవర్ నిర్మించారని, ఆ ఫ్లైఓవర్ కంటే మరింత ఎత్తులో మెట్రోరైలు పరుగులు తీయనుండటం నగరవాసులకు తప్పకుండా వింత అనుభూతిని కలిగించడం ఖాయమని స్టాలిన్ తన సందేశంలో పేర్కొన్నారు.

25న సభ్యత్వ కార్యక్రమం...

డీఎంకే ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 30 శాతం మంది యువతకు పార్టీ సభ్యత్వ కల్పించే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 25న ప్రారంభించనున్నారు. ప్రస్తుతం డీఎంకేకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు కోట్ల మంది వరకు సభ్యులున్నారు. రాష్ట్రంలోని 234 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి సభ్యత్వ కార్యక్రమాన్ని జరిపే నిర్వాహకులకు అన్నా అరివాలయంలో గత వారం రోజులుగా శిక్షణ కూడా ఇస్తున్నారు.

మా పార్టీలో సంక్షోభానికి డీఎంకే కారణం కాదు

● పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)లో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభానికి డీఎంకే కారణం కాదని ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ స్పష్టం చేశారు. నగరంలో అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే మణి, ఎమ్మెల్యే అరుళ్‌ను పరామర్శించేందుకు గురువారం రాందాస్ దిండివనం నుండి నగరానికి చేరుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్టీ కార్యాచరణ అధ్యక్షుడు అన్బుమణి ఆరోపించినట్లు పార్టీలోని సంక్షోభ పరిస్థితులకు డీఎంకేకు సంబంధం లేదని, ఈ విషయంలో అసత్య ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు. ఏవైనా తప్పిదాలు చేసి ఉంటే క్షమించాలంటూ అన్బుమణి వేడుకోవడంపై తానెలాంటి వ్యాఖ్యలు చేయదలచుకోలేదని రాందాస్ అన్నారు. అన్బుమణి మీ వద్దకు వచ్చి క్షమాపణ చెప్పాలని భావిస్తున్నారా? అని విలేఖరుల ప్రశ్నించగా.. రాందాస్ 'పోగ పోగ తెరియమ్' (రాబోవు రోజుల్లో తెలుస్తుంది) అంటూ ఓ పాత తమిళ సినిమా పాట పల్లవి అందుకున్నారు.



సుప్రీంకోర్టులో ఏడీజీపీకి ఊరట

● అరెస్టు ఉత్తర్వుల రద్దు
● సీబీసీఐడీ విచారణకు ఆదేశం


ఏడీజీపీ జయరామ్

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు వద్ద బాలుడి కిడ్నాప్ ఉదంతంలో ఏడీజీపీని అరెస్టు చేయాలని మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను కొనసాగిస్తూ, సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. బాలుడి కిడ్నాప్ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కేసు దర్యాప్తు నివేదికలో తన పేరు లేకపోయినప్పటికీ హైకోర్టు తనను అరెస్టు చేయాలని ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ ఏడీజీపీ జయరామ్ సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ అప్పీలుపై బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి ఉజ్జాల్ బుయాన్ నాయకత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం జయరాంపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులు ఉపసంహరించుకోవడానికి గల అవకాశాలను పరిశీలించి నివేదిక సమర్పించమంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. గురువారం ఉదయం మళ్ళీ ఈకేసు విచారణకు వచ్చినప్పుడు రాష్ట్ర పోలీసు శాఖ జయరామ్‌ను సస్పెండ్ చేయడానికి గల కారణాలతో నివేదిక సమర్పించింది. ఆ నివేదిక పరిశీలించిన సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసి, ఆ తర్వాత ఏడీజీపీ జయరామ్‌పై నమోదైన కేసులను సీబీసీడీతో విచారణ జరపాలని ఆదేశిస్తూ, ఈ విషయమై ప్రభుత్వంతో సంప్రదించి అరగంటలోగా నిర్ణయాన్ని తెలపాలని పోలీసుశాఖ తరఫు న్యాయవాదికి సూచించింది. ఆ మేరకు అరగంట తర్వాత ప్రభుత్వ తరఫు న్యాయవాది ధర్మాసనం ఎదుట హాజరై ఏడీజీపీ జయరామ్‌పై దాఖలైన కేసు విచారణను సీబీసీఐడీకి అప్పగించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిపారు. దీంతో జయరామ్‌ను అరెస్టు చేయాలనే హైకోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు సుప్రీం కోర్టు ప్రకటించింది.

'నా సైద్ధాంతిక సోదరుడు'

● రాహుల్‌కు సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ గాంధీ గురువారం 55వ జన్మదినం జరుపుకోనున్న నేపథ్యంలో, సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... 'నా సైద్ధాంతిక సోదరుడు రాహుల్ గాంధీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. మనం రక్తంలో ఆలోచన, దార్శనికతతో బంధించబడ్డాము. మీరు దృఢంగా నిలబడి ధైర్యంగా నడిపించాలి. ప్రకాశవంతమన భారత దేశం వైపు మన ప్రయాణంలో విజయం మనదే' అంటూ సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు సందేశంలో పేర్కొన్నారు.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

● సత్యమూర్తి భవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సందడి


సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

ప్యారీస్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను గురువారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యారీస్ తంబుశెట్టివీధిలోని కాళికాంబాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాహుల్ జన్మదినం సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చారు. పేదలకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేసారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్ కట్ చేశారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, సీనియర్ నేతలు కేవీ తంగబాలు, తిరునావుక్కరసర్, జేఎం హారూన్, ప్రధాన కార్యదర్శులు కె.చిరంజీవి, ఎన్.రంగబాష్యం, ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎంపీ రంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మైలాపూర్ శాంథోమ్ చర్చి ప్రాంగణంలో బిషప్‌లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే, అన్నాశాలైలోని దర్గాలో ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు అన్నదానం చేశారు. ప్యారీస్ మన్నడిలో ఉన్న కాళికాంబల్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. రాహుల్ జన్మదినం సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యావరణంపై అవగాహన కల్పించేలా విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. దక్షిణ చెన్నై, ఉత్తర చెన్నై, సెంట్రల్ చెన్నై పార్టీ నేతల నేతృత్వంలో రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేదప్రజలకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు.

నీటివనరులు కబ్జా చేస్తే
విద్యుత్, వాటర్ కనెక్షన్లు ఎలా ఇచ్చారు?

● ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు



ప్యారీస్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీటివనరుల్లో ఆక్రమణ కట్టడాలకు విద్యుత్, వాటర్ కనెక్షన్లు ఎలా ఇచ్చారో వివరణ ఇవ్వాలని తాంబరం కార్పొరేషన్ కమిషనర్, తమిళనాడు విద్యుత్ బోర్డుకు మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తాంబరం కార్పొరేషన్ పరిధిలోని నమంగళం ప్రాంతంలోని చెరువు ఆక్రమించి నిర్మించిన అపార్ట్‌మెంట్లను తొలగించాలని కోరుతూ అదే ప్రాంతానికి చెందిన రామచంద్రన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో నమంగళం చెరువులో ఆక్రమణ కట్టడాలకు సంబంధించిన ఫొటోలు ఆధారంగా సమర్పించి వాటి తొలగించాలన్న డిమాండ్‌పై తాంబరం కార్పొరేషన్ ఇప్పటివరకు స్పందించలేదని అందువల్ల ఆక్రమణలను తొలగించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్ కోరారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్, న్యాయమూర్తి సుందరమూర్తి సమక్షంలోని ధర్మాసనం ఎదుట హాజరైన తాంబరం కార్పొరేషన్ అధికారులు చెరువులో ఆక్రమణలున్నాయనే వాస్తవాన్ని అంగీకరించారు. అదే సమయంలో నీటి వనరులశాఖ కార్యదర్శి, తాంబరం కార్పొరేషన్ కమిషనర్, తమిళనాడు విద్యుత్ బోర్డు ఛైర్మెన్‌లను ఉద్దేశించి ఆక్రమణ కట్టడాలకు విద్యుత్ కనెక్షన్, వాటర్ కనెక్షన్, ప్లానింగ్ ఎలా ఇచ్చారన్న దానిపై సమగ్రవివరాలతో నివేదిక దాఖలు చేయాల్సిందిగా ఆదేశించి తదుపరి విచారణని జూలై 17కు వాయిదా వేశారు.

సీలువేసే అధికారం ఈడీకి లేదు

ఆస్తులకు సీలువేసే అధికారం ఈడీ అధికారులకు లేదని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. టాస్మాక్ అవినీతి కేసుకు సంబంధించి నిర్మాత ఆకాష్ భాస్కరన్, పారిశ్రామికవేత్త విక్రమ్ రవీంద్రన్ తదితరుల ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ తనిఖీలకు వ్యతిరేకంగా మద్రాస్ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ నెల 13న విచారణకు వచ్చిన ఈ కేసులో న్యాయమూర్తి ఈడీ అధికారుల వైఖరిని తప్పుబట్టారు. టాస్మాక్ కేసులో ఆకాష్ భాస్కరన్, విక్రమ్ రవీంద్రన్‌లను ఏ విధంగా విచారణ జరిపారు? విక్రమ్ రవీంద్రన్ ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీల అనంతరం సీలువేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించిన న్యాయమూర్తి.. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. ఇరు తరుపు వాదనలు విన్న అనంతరం తేదీ ప్రకటించకుండా తదుపరి విచారణను వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నవంబరు 28 నుంచి అంతర్జాతీయ జూనియర్ హాకీ పోటీలు

● లోగో ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి



లోగో ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఐఏఎస్ అధికారులు అతుల్య మిశ్రా, మేఘనాథరెడ్డి తదితరులు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జూనియర్ హాకీ పోటీల లోగోను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఆవిష్కరించారు. నగరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ పోటీలు రాష్ట్రంలో నిర్వహించేలా ఒప్పందం కుదుర్చుకోవడంతో పాటు లోగో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, ఎస్డీఏటీ కార్యదర్శి మేఘనాథ రెడ్డి, జాతీయ హాకీ కార్యదర్శి బోలోనాథ్ సింగ్, కోశాధికారి శేఖర్ జె.మనోహరన్ తదితరులు పాల్గొన్నారు. నవంబరు 28 నుంచి డిసెంబరు 10వ తేది వరకు చెన్నై, మదురైలో నిర్వహించే ఈ పోటీల్లో మొత్తం 24 జట్లు పాల్గొననున్నాయి. గత అంతర్జాతీయ పోటీల కంటే ఈ ఏడాది 8 జట్లు అదనంగా పాల్గొంటున్నాయి. ఈ పోటీలు లీగ్, నాకవుట్ రౌండ్లుగా జరుగనున్నాయి. ఈ పోటీల నిర్వహణకు రూ.65 కోట్లు కేటాయించారు. సెమిఫైనల్, ఫైనల్ పోటీలు చెన్నైలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

విభూది చెరిపేసి..!... సెల్ఫీ తీసుకుని..
ఇదేంది సారూ!

● తిరుమాపై నెటిజన్ల ఆగ్రహం


విభూది చెరిపేస్తున్న తిరుమావళవన్

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మదురై తిరుప్పరంగుండ్రం సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లిన డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ పూజల అనంతరం బయటకు వచ్చాక నుదుట వున్న విభూదిని చెరిపేయడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తిరుప్పరంగుండ్రం ఆలయానికి వెళ్లిన తిరుమావళవన్.. అక్కడ స్వామివారికి పూజలు చేసి బయటకు వచ్చారు. ఇంతలో ఓ జంట ఆయనతో సెల్ఫీ తీసుకుంటామని కోరగా, ఆయన నుదుటిన వున్న విభూదిని చెరిపేసుకుని, తరువాత సెల్ఫీ దిగారు. దీనిపట్ల నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఆలయ సందర్శనానంతరం తిరుమావళవన్ కొండ దిగువన వున్న సికిందర్ బాదుషా మసీదు నిర్వాహకులతోనూ భేటీ అయ్యారు.

సమాచార దర్శిని

పార్ట్‌టైం ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం ఇంజనీరింగ్ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పాలిటెక్నిక్ డిప్లొమో పూర్తయి ఉద్యోగంలో ఉంటూనే పార్ట్ టైం బీఈ కోర్సులు చేయవచ్చు. కోర్సుల వ్యవధి మూడున్నరేళ్లు. ఆసక్తి కలిగిన వారు https://ptbetnea.com/regn.php అనే వెబ్‌సైట్‌లో జూలై 11 లోపు దరఖాస్తులు సమర్పించాలి. అడ్మిషన్లకు సంబంధించిన ర్యాంకుల జాబితా జూలై 25న విడుదల చేసి, 28 నుంచి ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌లో కళాశాల ఎంపిక చేసుకున్న వారికి జూలై 31వ తేది సీటు కేటాయింపు సర్టిఫికెట్ అందజేయనున్నట్లు సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది.

రెండు ప్రాంతాల్లో పాదచారుల సముదాయాలు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'స్మార్ట్ సిటీ' పథకంలో భాగంగ రాయపురంలోని ఎంసీ రోడ్డు, నుంగంబాక్కంలోని ఖాదర్ నవాజ్‌ఖాన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పాదచారుల సముదాయాలు ఏర్పాటుచేసే పనులను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రారంభించింది. బెంగళూరు ఎంజీ రోడ్డు, చర్చి స్ట్రీట్ ప్రాంతాల్లోలాగే 24 గంటలు పనిచేసే పాదచారుల సముదాయాలు ఏర్పాటుకానున్నాయి. పార్కులు, ప్రజలు కూర్చొనేందుకు సీట్లు, పిల్లల ఆట స్థలం తదితరాలతో ఈ సముదాయాలుంటాయని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

1,132 ప్రాంతాల్లో కాలనీ, జాతి పేర్ల తొలగింపు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఉత్తర్వులతో కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలోని 1,132 ప్రాంతాల్లో కాలనీ, జాతి పేర్ల తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కొత్త పేర్లకు కాన్సెప్ట్ సిద్ధం చేయాలని స్థానిక సంస్థల అధికారులను ఆదేశించిన ప్రభుత్వం, పూలు, చెట్లు, నాయకులు, చరిత్ర, ప్రకృతి ఆధారంగా వాటికి పేర్లు పెట్టాలని సూచించింది.

నాగై-శ్రీలంక నౌకా సేవలు ప్రారంభం

పెరంబూర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నాగపట్టణం హార్బర్ నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు 'శివగంగ' అనే ప్రయాణికుల నౌక సేవలు అందుబాటులోన్నాయి. రాష్ట్ర సముద్రతీర సరిహద్దుల్లో గాలుల వేగం అధికంగా ఉన్న నేపథ్యంలో, ఈ నెల 13 నుంచి 17 వరకు నౌక సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో, బుధవారం యధావిధిగా నౌక సేవలు ప్రారంభం కాగా, 95 మంది ప్రయాణికులతో నాగపట్టణం హార్బర్ నుంచి నౌక శ్రీలంకకు బయల్దేరి వెళ్లింది.

నేటినుంచి అమరావతి డ్యాం సాగు నీరు విడుదల

వాషర్‌మెన్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి డ్యాం నుంచి శుక్రవారం నుంచి సాగు నీరు విడుదల చేయనున్నారు. ఈ మేరకు సచివాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... తిరుప్పూర్ జిల్లా అమరావతి డ్యాం నుంచి శుక్రవారం నుంచి జూలై 5వ తేది వరకు 15 రోజులు సాగునీరు విడుదల చేయనున్నారు. ఈ నీటి ద్వారా జిల్లాలోని 25,250 ఎకరాల రైతులు లబ్ధిపొందుతారని సచివాలయం తెలియజేసింది.

మేట్టూరు డ్యాం నుంచి సాగునీటి విడుదల పెంపు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాం నుంచి డెల్టాకు విడుదల చేస్తున్న సాగునీటి పరిమాణం పెంచారు. కావేరి పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టూరు డ్యాంలోకి బుధవారం 6,040 ఘనపుటడుగుల మేర వస్తున్న నీరు, గురువారం ఉదయం 6,829 ఘనపుటడుగులకు పెరిగింది. డ్యాం నుంచి 12వేల ఘనపుటడుగుల సాగునీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 114.13 అడుగుల చొప్పున 83.94 అడుగుల నీటినిల్వలున్నాయని,కర్ణాటక రాష్ట్రం కబిని డ్యాం నుంచి విడుదల చేసిన నీరు మరో రెండు రోజుల్లో డ్యాంలో చేరే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

2న పోలీసు వాహనాల వేలం

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసులు వినియోగించిన 48 నాలుగు చక్రాల వాహనాలు సహా 234 వాహనాలను జూలై 2వ తేది వేలం వేయనున్నారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ఎగ్మూర్‌లోని రాజారత్నం మైదానంలో ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ద్వారా 188 ద్విచక్రవాహనాలు సహా 234 వాహనాలు వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాజారత్నం స్టేడియంలో ఆధార్ కార్డు నకలు, జీఎస్టీ నెంబరు, రూ.1,000 డిపాజిట్‌తో పేరు నమోదుచేసుకోవాల్సి ఉంది. బహిరంగ వేలంలో వాహనాలు కొనుగోలు చేసిన వారు అదే రోజు 25 శాతం, మరుసటిరోజు మిగిలిన 75 శాతం జీఎస్టీ కలపి చెల్లించి వాహనాలు తీసుకెళ్లాలని నగర పోలీసు శాఖ తెలిపింది.

అమ్మకపు పత్రాల రిజిస్ట్రేషన్ రుసుము 2 శాతం తగ్గింపు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి అమ్మకపు పత్రాల వలే, అమ్మకపు పత్రాల రిజిస్ట్రేషన్ 4 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. రాష్ట్రంలో యజమాని నుంచి నేరుగా ఆస్తుల కొనుగోలు సమయంలో, దానికి అమ్మకపు పత్రాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అందుకోసం ఆస్తి విలువపై 7 శాతం స్టాంప్ డ్యూటీ, 2 శాతం రిజిస్ట్రేషన్ రుసుము వసూలుచేస్తుంటారు. అదే సమయంలో, బ్యాంక్ ఆర్డర్లు, రుణ రికవరీ ట్రిబ్యునల్స్, వేలం ద్వారా బదిలీ చేయబడిన ఆస్తులకు అమ్మకపు పత్రాలు మాత్రమే జారీ చేస్తుంటారు. ఈ పత్రాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పొందవచ్చు. ఈ పత్రాల రిజిస్ట్రేషన్ రుసుముగా 4 శాతం వసూలుచేస్తుండగా, ప్రస్తుతం 2 శాతానికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులను పురస్కరించుకుని ప్రతిరోజు నడిచే బస్సులతో పాటు అదనపు బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 275 బస్సులు, శనివారం 320 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్రవారం 55 బస్సులు, శనివారం 55 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల నుంచి పలు నగరాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్‌ఈటీసీ తెలిపింది.

ఓటమి భయంతో డీఎంకేలో వణుకు

● బీజేపీ నేత నయినార్‌నాగేంద్రన్



వడపళని ఆలయంలో నయినార్ నాగేంద్రన్‌కు ప్రసాదం అందజేస్తున్న ప్రధానార్చకులు

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరగనున్న శాసనసభ ఎన్నికలలోపే మిత్రపక్షాలు అధిక సీట్ల కోసం పట్టుబట్టి కూటమి నుంచి వెళ్లిపోతాయని, ఆ ఎన్నికల్లో ఘోరపరాజయం తప్పదని డీఎంకే నేతలకు వణుకుపట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ విమర్శించారు. గురువారం ఉదయం ఆయన పార్టీ నేతలతో కలిసి వడపళనిలోని మురుగన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ డీఎంకే కూటమిలో ఇప్పటికే డీపీఐ అలకపాన్పు వహిస్తోందని, ఈసారి 15 స్థానాలను కేటాయించాలంటూ పట్టుబడుతోందన్నారు. మదురైలో ఈ నెల 22న జరగనున్న మురుగన్ భక్తుల మహానాడు కోసం తామంతా పక్షం రోజులపాటు వ్రతమాచరిస్తున్నామని, ఆ కారణంగానే రోజూ సమీప ప్రాంతాల్లో ఉన్న మురుగన్ ఆలయాలను దర్శించుకుంటున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా మురుగన్ భక్తుల మహానాడుకు హాజరుకానుండడంతో ఆయన కూడా దీక్ష కొనసాగిస్తున్నారని నయినార్ నాగేంద్రన్ తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు హిందూమున్నాని ఆధ్వర్యంలో జరిగే ఈ మహానాడు గురించి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మురుగన్ భక్తుల మహానాడు జరిగినప్పుడు తామెవరూ విమర్శలు చేయలేదన్నారు. మురుగన్ మహానాడు జరిపితే మత ఘర్షణలు జరుగుతాయని మంత్రి శేఖర్‌బాబు చెబుతుండటం ఓర్వలేనితనానికి నిదర్శనమని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **పల్లావరం:** కీలకట్టలై జైన్ గ్రీన్ ఏకర్స్ అపార్ట్‌మెంట్ గ్రూప్ హౌస్, లతీఫ్ కాలనీ 1 నుంచి 3 వీధులు, కామరాజ్ నగర్, దర్గా లైన్, రోడ్డు, రేణుక నగర్, కేహెచ్ హౌసింగ్, వేంబులి నగర్, ఎన్ఎస్కే నగర్, జీపీ మాధవన్ వీధి. **వేళచ్చేరి:** బైపాస్ 100 అడుగుల రోడ్డు లక్ష్మీ నగర్ 1 నుంచి 6 వీధులు, రాజు గాంధీ వీధి, ఎంజీఆర్ నగర్ 1 నుంచి 7 వీధులు, వెంకటేశ్వర నగర్12 వీధులు, భువనేశ్వరి నగర్, నాథన్ సుబ్రమణి కాలనీ, వీజీపీ సెల్వ నగర్, బెతేల్ అవెన్యూ, ముత్తుకృష్ణన్ వీధి. **తాంబరం:** ఎరుంబులియూర్ సుందానంద భారతి వీధి, మోతిలాల్ నగర్, లక్ష్మీ నగర్, గణపతి పురం, శర్మ వీధి, మురుగేశన్ వీధి, పరాలినెల్లయప్పర్ వీధి, అశోక్ నగర్, ఎంఈఎస్ రోడ్డు కొంత భాగం, శ్రీరామ్ నగర్, చిట్లపాక్కం గణేష్ నగర్, 100 అడుగుల రోడ్డు, ధనలక్ష్మి వీధి. **అడయార్:** బీసెంట్ నగర్ గంగై వీధి, అప్పర్ వీధి, టైగర్ వరదాచారి వీధి, అరుళ్‌డెల్ బీచ్ రోడ్డు, బీచ్ రోడ్డు, రుక్మిణి రోడ్డు, అష్టలక్ష్మి గార్డన్, ఓడైకుప్పం, దిడీర్ నగర్, కోస్టల్ రోడ్డు, తిరుమురుగన్ వీధి, వైగై వీధి, కావేరి వీధి, కొట్టివాక్కం కుప్పం, 1 నుంచి 4 సీవార్డ్ రోడ్లు, బాలకృష్ణ రోడ్డు, తిరువీధియమ్మన్ ఆలయ వీధి, ఈసీఆర్ మెయిన్ రోడ్డు, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 8 మెయిన్ రోడ్లు, 1 నుంచి 54 క్రాస్ వీధులు, ఐటీబీ, భగత్‌సింగ్ రోడ్డు 1 నుంచి 6 వీధులు, ఆర్టీఓ ఆఫీస్, శివాని అపార్ట్‌మెంట్స్. **షోలంగనల్లూర్:** శంకరాపురం, కన్నికోయిల్, సీతలపాక్కం మెయిన్ రోడ్డు, హౌసింగ్ బోర్డు, వేలక్కాల్, పొన్నియమ్మన్ కావడి, గాంధీ వీధి, నన్మంగళం కొంత భాగం.

తండ్రిని కోల్పోయిన విద్యార్థిని ఫీజు చెల్లిస్తాం

● కోవై కలెక్టర్ పవన్ కుమార్



విద్యార్థినిని పరామర్శిస్తున్న కలెక్టర్ పవన్‌కుమార్

వాషర్‌మెన్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తండ్రిని కోల్పోయిన బాలిక విద్యా ఫీజు జిల్లా యంత్రాంగం భరిస్తుందని కోయంబత్తూర్ జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. సుల్తాన్‌పేట సమీపం వారప్పాడి గ్రామానికి చెందిన విద్యార్థిని నక్షత్ర ప్లస్ టూ ఉత్తీర్ణురాలైంది. ఇటీవల తండ్రి మృతి చెందడంతో ఆర్థిక స్థోమత లేని కారణంగా నక్షత్ర ఉద్యోగానికి వెళుతోంది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ విద్యార్థిని నక్షత్ర ఇంటికి వెళ్లారు. ఆమెను పరామర్శించి 'కల్లూరి కనవు' పథకంలో ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదివేందుకు అడ్మిషన్ కల్పించడంతో పాటు ఆ విద్యార్థి చదువు పూర్తయ్యేవారకు ఆమె విద్యా ఫీజు జిల్లా యంత్రాంగం భరిస్తుందని తెలిపారు.

పడవ మునిగి జాలరి గల్లంతు

వాషర్‌మెన్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండపం నుంచి చేపల వేటకు వెళ్లిన మరపడవ బోల్తాపడిన ఘటనలో జాలరి గల్లంతవగా, మరో ముగ్గురిని సహచర జాలర్లు రక్షించారు. రామేశ్వరం సమీపం మండలం ఫిషింగ్ హార్బర్ నుంచి సర్బుద్దీన్‌కు చెందిన పడవలో అనీస్ (30), మాధవన్ (28), ఇబ్రహీం (40), పరీదు (29) చేపల వేటకు వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి సముద్రంలో చేపలుపడుతుండగా, హఠాత్తుగా పడవ ఒక పక్క చెక్క విరగడంతో, పడవ మునిగి నలుగురు జాలర్లు నీళ్లలో పడిపోయారు. ఆ సమీపంలో చేపలు పట్టే జాలర్లు, హుటాటిన అక్కడకు చేరుకుని అనీస్, మాధవన్, పరీదులను రక్షించారు. ఇబ్రహీంసా కోసం చాలాసేపు గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం తీరానికి చేరుకున్న జాలర్లు, ఈ విషయాన్ని మత్స్యశాఖ, మెరైన్ పోలీసులకు తెలిపారు. దీంతో, మూడు పడవల్లో వెళ్లిన మెరైన్ పోలీసులు, ఇబ్రహీంసా కోసం గాలిస్తున్నారు.

ఏనుగు దాడిలో కార్మికుడి మృతి

ప్యారీస్,జూన్19(ఆంధ్రజ్యోతి):నీలగిరి జిల్లా గూడలూరులోని తేయాకు తోటలో చొరబడిన ఏనుగు దాడిలో ఓ కార్మికుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గూడలూరు ప్రాంతంలోని తేయాకు తోటలో మచ్చికొళ్లి గ్రామానికి చెందిన ఆర్ముగం (40) కొందమంది కార్మికులతో కలిసి కూలీ పని చేస్తుంటాడు. అతడు బుధవారం రాత్రి పని ముగించుకుని తేయాకు తోట నుండి బయటకు వెళ్తున్న సమయంలో అటువైపు వచ్చిన ఏనుగును చూసి భయంతో పరుగులు తీశాడు. అయినా ఆ ఏనుగు అతడిని వెంటాడి కాలితో తొక్కి హతమార్చింది. వెంటనే అక్కడున్న కార్మికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం తెలియజేశారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న అటవీశాఖ పోలీసులు ఏనుగును అడవిలోకి తరిమివేశారు. ఆ తర్వాత ఆర్ముగం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ నేపథ్యంలో, గూడలూరు, బందలూరు ప్రాంతాల్లో తేయాకు తోటలు అధికంగా ఉన్నాయని గత రెండు వారాల్లో ఏనుగుల దాడిలో ఇద్దరు కార్మికులు మృతి చెందారని, ఏనుగుల బెడదనుంచి తమను కాపాడాలని స్థానికులు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కొవిడ్ పేరుతో అధిక ఫీజులు వసూలుచేస్తే చర్యలు

● ప్రైవేటు ఆస్పత్రులకు వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరిక

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ చికిత్సల పేరుతో అధిక ఫీజులు వసూలుచేసే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరించింది. కొద్దికాలంగా దేశవ్యాప్తంగా కొవిడ్ క్రమక్రమంగా వ్యాప్తి చెందుతోంది. రాష్ట్రంలో కూడా సుమారు 200 మందికి పైగా కొవిడ్ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. ప్రస్తుతం వ్యాపిస్తున్న కరోనా ప్రాణాంతకం కాదని ఆరోగ్య శాఖ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో, జ్వరం లక్షణాలతో వస్తున్న బాధితుల దగ్గర కొవిడ్ పేరుతో ప్రైవేటు ఆస్పత్రులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయంటూ ఆరోగ్యశాఖకు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన ఆరోగ్య శాఖ, కొవిడ్ పేరుతో అధిక ఫీజులు వసూలుచేస్తే చర్యలు చేపడతామని, కరోనా నిర్ధారణ అయిన వారి వివరాలు ప్రతిరోజు ఆరోగ్య శాఖకు పంపించాలని ప్రైవేటు ఆసుపత్రులకు ఉత్తర్వులు జారీచేసింది.

ప్యాటర్సన్ క్యాన్సర్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్యాటర్సన్ క్యాన్సర్ సెంటర్ 23వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరం ప్రారంభించింది. ఈ శిబిరం ఆదివారం వరకు కొనసాగనుంది. రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి ఎన్. అరుణాచలం, విజయ్ నర్సింగ్ హోం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.కుమారవేల్, శ్రీనివాసన్ రాజలక్ష్మి మెమోరియల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఎస్. కృష్ణన్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సౌందరరాజన్, చిత్ర నిర్మాత ఎల్రెడ్ కుమార్, నగర డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఈ ఆస్పత్రికి ఛైర్మన్‌గా వ్యవహరించారని, ఆయన ఆశయాల మేరకు తమ కేంద్రం క్యాన్సర్ రహిత సమాజం కోసం అహరహం కృషి చేస్తోందని తెలిపారు.

రాజ్యాంగ హక్కులు హరించే ఆదేశాలను హైకోర్టు పునఃపరిశీలించాలి

● సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తరసన్

వాషర్‌మెన్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కులు హరించే ఆదేశాలను హైకోర్టు పునఃపరిశీలించాలని, సవరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాజకీయ పార్టీలు జెండా స్తంభాల ఏర్పాటుకు సంబంధించి జనవరి 28న మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ హక్కులకు విరోధమన్నారు. ఇలాంటి తీర్పును పునఃసమీక్షించాలని ముత్తరసన్ విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముసిరి ఆర్డీవో దుర్మరణం



సంఘటనా స్థలం - ఆరముత్త దేవసేన (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా ముక్కొంబు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముసిరి రెవెన్యూ డివిజినల్ అధికారి (ఆర్డీఓ) ఆరముత్త దేవసేన మృతిచెందారు. ముసిరి ఆర్డీవో దేవసేన గురువారం ఉదయం ప్రభుత్వ వాహనంలో తిరుచ్చి వైపు బయల్దేరారు. తిరుచ్చి-కుళిత్తలై రోడ్డు ముక్కొంబు సమీపంలో హఠాత్తుగా ఆమె ప్రయాణిస్తున్న వాహనం టైర్ పేలిపోయింది. ఆ సమయంలో ముందు వెళ్తున్న ప్రభుత్వ బస్సును తప్పించేందుకు డ్రైవర్ ఎడమ వైపు వాహనం తిప్పినట్లు సమాచారం. ఆ సమయంలో బస్సు సమీపంలో ఉన్న ఎక్సకవేటర్‌ను ఆర్డీవో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ముందు సీట్లో ఉన్న ఆర్డీవో దేవసేన తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందగా, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అరినత్తుం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.

సీఎం దిగ్భ్రాంతి...

రోడ్డు ప్రమాదంలో ముసిరి ఆర్డీవో మృతిపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఆర్డీఓ ఆరముత్త దేవసేన మృతి రెవెన్యూ శాఖకు తీరని నష్టమన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆమె కుటుంబానికి రూ.15 లక్షలు పరిహారం అందజేయనున్నట్లు, ప్రభుత్వ అధికారుల బీమా మొత్తం రూ. కోటి అందజేస్తామని సీఎం తెలిపారు.

డబ్బు ఇవ్వలేదని తల్లిని హతమార్చిన కొడుకు



వల్లియమ్మాళ్ (ఫైల్‌ఫొటో) - నిందితుడు మురుగన్

తిరుత్తణి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తాగుడికి బానిసై కన్నతల్లిని డబ్బుల కోసం హత్యచేసిన సంఘటన తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపంలోని మీసరగంధపురం గ్రామంలో జరిగింది. వివరాలిలా... మీసరగంధపురం గ్రామంలో వల్లియమ్మాళ్ (67)అనే వృద్ధురాలు తనకు వచ్చే ప్రభుత్వ పింఛన్ ద్వారా ఒంటరిగా జీవిస్తోంది. ఆమె కుమారుడు మురుగన్ వేలూరు జిల్లా కాట్పాడిలో తన కుటుంబంతో కలిసివుంటున్నాడు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసైన మురుగన్ ఆర్కేపేటలోని ఓ రిటైర్డ్ ఆర్మీ అధికారి వద్ద రూ.11లక్షలు అప్పుతీసుకున్నట్లు సమాచారం. తీసుకున్న అప్పు తీర్చలేని పరిస్థితిలో మరింతగా మద్యానికి బానిసై మీసరగంధపురం గ్రామంలో ఉంటున్న తన తల్లిని రూ.11 లక్షలు ఇవ్వాలంటూ ఒత్తిడి చేయసాగాడు. అంత డబ్బు లేదని ఆమె ఎంతచెప్పినా వినేవాడుకాదు. ప్రతిరోజు వల్లియమ్మాళ్ ఇంటికి వచ్చి డబ్బుకోసం ఆమెను మానసికంగా ఆవేదనకు గురిచేసేవాడు. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి సమయంలో వల్లియమ్మాళ్ ఇంటికెళ్ళి ఆమెతో వాగ్వాదానికి దిగాడు. నగదు ఇవ్వలేదన్న కోపంతో కత్తి తీసుకుని వల్లియమ్మాళ్‌ను దారుణంగా నరికి హతమార్చాడు. కేకలు విని అక్కడికి చేరుకున్న గ్రామస్థులను చూసిన మురుగన్ అక్కడినుండి పరారయ్యాడు. పోలీసులకు సమాచారం అందడంతో వారు అక్కడికి చేరుకుని వల్లియమ్మాళ్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, నిందితుడు మురుగన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తిరుత్తణిలో రాహుల్ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుత్తణి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మండల కాంగ్రెస్ పార్టీనేతల సమక్షంలో పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలా థియేటర్ వద్దనున్న దివంగత మాజీప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం శ్రీనివాసపురంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తిరుత్తణి కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణన్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు త్యాగరాజన్, కాంగ్రెస్ న్యాయవాది విభాగం కార్యదర్శి గోవిందరాజ్, రాష్ట్ర నిర్వాహకులు మాధవి రాజా సహా పలు విభాగాలకు చెందిన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మాజీ ఎస్ఐ మహేశ్వరి ఆస్తుల స్తంభన

వాషర్‌మెన్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల అపహరణ కేసులో జైలులో ఉన్న మాజీ ఎస్ఐ మహేశ్వరి ఆస్తులు స్తంభింపజేయాలని పోలీసులు నిర్ణయించారు. అపహరణ ఘటనలో కీలక వ్యక్తిగా చెప్పబడుతున్న మాజీ ఎస్ఐ మహేశ్వరి పాత్రపై దర్యాప్తు జరుగుతోంది. మదురైకి చెందిన మహేశ్వరి కొడైకెనాల్‌లో ఒక కంపెనీ నడుపుతున్నట్లు కూడా చెబుతున్నారు. ఆమె కట్ట పంచాయితీలు చేసి లక్షలు సంపాదించినట్లు దర్యాప్తులో తెలిపింది. మహేశ్వరి అక్రమంగా సంపాదించిన ఆస్తులు పరిశీలించి వాటిని స్తంభింపజేయాలని పోలీసులు నిర్ణయించారు. అలాగే, మహేశ్వరి సహచరులు ఎవరు అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

మెదడు నిర్జీవమైన యువకుడి అవయవదానం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది (అంతర్ చిత్రంలో) శివబండారం

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన యువకుడు, అవయవదానం ద్వారా మరికొందరికి పునర్జన్మ అందించారు. తూత్తుకుడి జిల్లా శ్రీ వైకుంఠం తాలూకా పద్మనాభలింగం పేచ్చి అమ్మన్ వీధికి చెందిన శివబండారం (21) ఈ నెల 6వ తేది ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. అతనికి తూత్తుకుడి ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి 16వ తేది తిరునల్వేలి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న శివబంగారం మరునటి రోజు మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యులు శివబండారం అవయవాలు దానం చేసేందుకు అంగీకరించడంతో, వైద్యులు ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా అతడి అవయవాలు వెలికి తీసి పలు ఆస్పత్రులకు తరలించారు. యువకుడి మృతదేహానికి వైద్యులు, సిబ్బంది నివాళులర్పించారు.

రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికా దళం దాడి

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికా దళం అమానుషదాడులకు పాల్పడింది. రాష్ట్రంలో చేపల వేట నిషేధ కాలం ఈ నెల 14వ తేదీతో ముగిసింది. కానీ, బలమైన గాలుల కారణంగా జాలర్లు సముద్రంలో వేటకు వెళ్లలేదు. గాలుల వేగం తగ్గడంతో రామేశ్వరం హార్బర్ నుంచి ఈ నెల 17న మరపడవల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లారు. నడి సముద్రంలో గురువారం తెల్లవారుజామున చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ వలలు, ఇతర ఉపకరణాలు ధ్వంసం చేయడంతో పాటు పట్టుకున్న చేపలను సముద్రంలోకి వదిలిపెట్టింది. ఈ విషయమై జాలర్ల సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నిషేధకాలం ముగిసి చేపల వేటకు వెళ్లిన తొలిరోజే లంక నావికా దళం దాడులకు పాల్పడుతోందని, ఈ దాడులు అడ్డుకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

● మెట్రో నిర్మాణంలో ప్రమాదం...

నలుగురు ఇంజనీర్ల డిస్మిస్

● ఎల్ అండ్ టీ సంస్థకు రూ.కోటి జరిమానా

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురం వద్ద ఈ నెల 12 రాత్రి మెట్రో రైలు మార్గం నిర్మాణ పనుల్లో రెండు స్తంభాలపై ఉంచిన కాంక్రీటు దిమ్మెలు జారి పడి ఒకరు మృతి చెందిన సంఘటనకు సంబంధించిన నలుగురు ఇంజనీర్లను డిస్మిస్ చేశారు. ఆ సంఘటనపె విచారణ జరిపిన మెట్రో రైల్వే సంస్థ అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. రామాపురం - డీఎల్ఎఫ్ ప్రాంతాల నడుమ మెట్రోరైలు మార్గం నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు కాంక్రీటు దిమ్మెలు పడి రోడ్డుపై బైకులో వెళుతున్న రమేష్ (43) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. దీంతో రమేష్ కుటుంబానికి మెట్రోరైల్వే సంస్థ రూ.5లక్షలు, మెట్రో ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ ఎల్అండ్‌టి రూ.20లక్షలను నష్ట పరిహారం ప్రకటించి అందజేశాయి. ఈ సంఘటనపై మెట్రో రైల్వే సంస్థ విచారణ జరిపి అక్కడ డ్యూటీలో ఉన్న నలుగురు ఇంజనీర్లను డిస్మిస్ చేసింది. ఇక మెట్రోరైలు పనులు చేపడుతున్న ఎల్అండ్‌టికి రూ.కోటి జరిమానగా విధించింది.

ఆలయ కలశాల చోరీ

● ఇద్దరు బాలుర అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆలయ కలశాలు చోరీచేసిన ఇద్దరు బాలురను పోలీసులు అరెస్ట్ చేశారు. పులియాంతోపు సమీపంలోని పీకే కాలనీలో ఉన్న ముత్తుమారియమ్మన్ ఆలయ కలశాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ జరిపి ఆలయ కలశాలను పాత సామానుల దుకాణంలో విక్రయించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఇద్దరు బాలురను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని జువైనల్ హోంకు తరలించారు.

నగరంలో పది మంది రౌడీల అరెస్టు

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో రౌడీల బెడదను పూర్తిగా నిర్మూలించే దిశగా పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం వేకువజాము దాకా వేట సాగించారు. ఆ సందర్భంగా ఒట్టేరి పరోటా శీను సహా 10 మంది రౌడీలను అరెస్టు చేశారు. వారి నుండి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పుళియంతోపు, ఒట్టేరి ప్రాంతాల్లో సాగిన పోలీసుల తనిఖీల్లో పలువురు రౌడీలు పారిపోయారు. వీరి ఆచూకీ కోసం ప్రస్తుతం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

పదో తరగతి విద్యార్థిపై కత్తితో దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై ఆరణి కోట వీధిలోని ప్రభుత్వ ఎయిడెడ్ సుబ్రహ్మణ్య శాస్త్రి మహోన్నత పాఠశాల వద్ద పదో తరగతి విద్యార్థిపై అతడి క్లాస్‌మేట్ కత్తితో దాడి చేశాడు. ఆ పాఠశాలలో పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3 వేలమంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరణి సమీపం కందరీగమ్ పట్టు గ్రామం నుండి విద్యార్థులు ప్రతిరోజూ టౌన్ బస్సుల్లో పాఠశాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆ బస్సులో చేనేత కార్మికుడు మేఘనాధన్ కుమారుడు, పదో తరగతి విద్యార్థి సతీష్ కుమార్ (15), అతడి క్లాస్‌మేట్ వశీకరన్ (15) ప్రయాణించి స్కూలు దగ్గర దిగారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య ఏదో విషయంపై గొడవ ఏర్పడింది. ఆ సమయంలో ఉన్నట్టుండి వశీకరన్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సతీష్‌కుమార్‌పై దాడి చేశాడు. ఈ సంఘటనలో సతీష్‌కుమార్ మెడకు, చేతివేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వశీకరన్‌కు గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ గొడవపడిన ఇద్దరు విద్యార్థులు ఈ యేడాదే స్కూలులో చేరారని, వారి మధ్య పాతకక్షలుండవచ్చునని, ఆ కారణంగా స్కూలు వద్ద ఘర్షణకు దిగా ఉంటారని తెలిపారు.

తూత్తుకుడిలో 8 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

ప్యారీస్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి అంబేడ్కర్ జంక్షన్‌లో అనుమానాస్పదంగా సంచరించిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారినుంచి 8.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తూత్తుకుడి ఎస్పీ అల్బర్ట్ జాన్ ఉత్తర్వుల మేరకు నగరంలో నిఘా ముమ్మరం చేసిన పోలీసులు బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో అంబేడ్కర్ జంక్షన్‌లో లగేజీతో అనుమానాస్పదంగా సంచరించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. తూత్తుకుడి నటరాజపురంకు చెందిన మురుగన్ (27), గోపి (23), మారియప్పన్ (23) అనే వారి నుంచి 8.400 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న ఈ గంజాయితో వ్యాపారం చేయదలచినట్లు వాస్తవాన్ని అంగీకరించారు. గురువారం ఉదయం వారిని జిల్లాకోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

పీఎంకే ఎమ్మెల్యే అరుళ్ డిశ్చార్జి

వాషర్‌మెన్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు కారణంగా స్థానిక ఓమందూర్ ఆస్పత్రిలో బుధవారం చేరిన పీఎంకే ఎమ్మెల్యే అరుళ్ గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఆస్పత్రిలో ఆయనకు గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. సేలం, ధర్మపురి జిల్లాల నిర్వాహకులతో అన్బుమణి గురువారం సమావేశం అవుతున్నట్లు ప్రకటించగా, సేలం వెస్ట్‌కు చెందిన పార్టీ ఎమ్మెల్యే అరుళ్ హఠాత్తుగా గుండెపోటుతో ఆసుపత్రిలో చేరారు. గురువారం అన్బుమణి సమావేశం ముగిసిన నేపథ్యంలో, సాయంత్రం ఎమ్మెల్యే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావడం కొసమెరుపు.

హెచ్.వినోద్ దర్శకత్వంలో రజనీకాంత్?


హెచ్.వినోద్

అగ్రహీరోలు అజిత్, విజయ్ వంటివారి చిత్రాలకు దర్శకత్వం వహించిన సినీ దర్శకుడు హెచ్.వినోద్ తన తదుపరి చిత్రం సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో చేయనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకునే ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన త్వరలో వెల్లడికానున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్.. యువ దర్శకుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ'లో నటించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టులో విడుదలకానుంది. అలాగే, నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో 'జైలర్' వంటి మెగా బ్లాక్‌బస్టర్ హిట్ మూవీకి సీక్వెల్‌గా రూపొందే 'జైలర్-2'లో రజనీకాంత్ నటిస్తున్నారు. అదేవిధంగా హెచ్.వినోద్ కూడా అగ్రహీరో విజయ్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత రజనీ - హెచ్.వినోద్ కలిసి పనిచేయనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ విషయంపై రజనీతో హెచ్.వినోద్ రెండుసార్లు కలిసి చర్చించడంతో వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ చిత్రం రావడం ఖాయమనే ప్రచారం జోరుగా సాగుతోంది.

చిత్రజ్యోతి

ఏఎల్ విజయ్ సినిమాలు విడుదలకు సిద్ధం

ప్రముఖ దర్శకుడు ఏఎల్.విజయ్ రెండు చిత్రాలను తెరకెక్కించగా, ఈ రెండూ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో ఒకటి మాధవన్, కంగనా రనౌత్ నటించారు. గతంలో కంగనాతో ఏఎల్ విజయ్ 'తలైవి' అనే చిత్రాన్ని రూపొందించిన విషయం తెల్సిందే. అలాగే, మాధవన్ - కంగనా కాంబినేషన్‌లో గతంలో బాలీవుడ్‌లో రెండు సినిమాలు రాగా, ఇపుడు మళ్ళీ మూడోసారి కలిసి నటించారు. అదేవిధంగా కొత్త నటీనటులతో మరో చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ రెండు సినిమాలు ఇపుడు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇవికాకుండా, అనుష్క ప్రధాన పాత్రలో ఒక చిత్రం, ఓ వెబ్ సిరీస్ ఇలా మరో రెండు ప్రాజెక్టులు ఏఎల్.విజయ్ చేతిలో ఉన్నాయి. కాగా, 'మదరాసపట్టిణం', 'కిరీడం', 'దైవతిరుమగన్', 'సైవం', 'తాండవం' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన విజయ్ కెరీర్‌లో 'దేవి-2', 'తలైవి', 'మిషన్ చాప్టర్-1' ఫెయిల్యూర్ సినిమాలు కూడా ఉన్నాయి. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం విడుదలై యేడాదిన్నర అయింది. ఇపుడు వరుసగా రెండు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.


ఏఎల్.విజయ్

ఒకే రాత్రిలో జరిగే కథతో 'పిక్ ప్యాకెట్'

డైరెక్టర్, ఈవెంట్ హోస్ట్ పీఆర్ విజయ్, విదా స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించే చిత్రానికి 'పిక్ ప్యాకెట్' అనే పేరు ఖరారు చేసి ఒకే రాత్రిలో జరిగే కథతో తెరకెక్కించనున్నారు. పీఆర్ విజయ్, యోగలక్ష్మి, పవన్ కిషోర్, సుందర్, అలెక్స్ ఇయన్, క్రిస్టియన్, సందీప్, గాంధియన్ తదితరులు నటిస్తున్నారు. జేఎస్ జుబేర్ కథ సమకూర్చి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'ఒకే రోజు రాత్రి జరిగే స్టోరీ. రాత్రి 7 గంటలకు ప్రారంభమై ఉదయం 4 గంటలకు పూర్తవుతుంది. పిక్ ప్యాకెట్‌ను ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని పూర్తి స్క్రిప్టు సిద్ధం చేశాం. పిక్ ప్యాకెట్‌లకు పాల్పడేవారి వెనుక పెద్ద మాఫియానే ఉందనే విషయాన్ని ప్రేక్షకులు ఆశ్చర్యపోయేలా తెరకెక్కించనున్నాం. షూటింగ్‌ను పుదుచ్చేరిలో పూజా కార్యక్రమంతో ప్రారంభించాం. ఇందులో పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి పాల్గొని తొలిక్లాప్ కొట్టి చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ చెప్పారు' అని పేర్కొన్నారు.


పూజా కార్యక్రమంలో సీఎం రంగస్వామి తదితరులు

జీవితాన్ని నాశనం చేయొద్దు

● అనుపమ పరమేశ్వరన్

మీకు ఇష్టమైతే తనపై విమర్శలు, ట్రోల్స్ చేసుకోవచ్చని, కాని వాటి ద్వారా తన జీవితాన్ని నాశనం చేయొద్దని హీరోయిన్ అనుపమ పరమేశ్వన్ నెటిజన్లకు విజ్ఞప్తి చేశారు. తాజాగా జరిగిన ఒక సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, 'ఇటీవల కాలంలో నాపై విమర్శలు, ట్రోల్స్ పెరిగిపోయాయి. ఇలా చేయడంలో నాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ, వాటిద్వారా నా జీవితాన్ని నాశనం చేయొద్దని కోరుతున్నాను. సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన తర్వాత ఇప్పటివరకు నాకు సపోర్టు చేస్తున్న వారికి, అండగా నిలిచిన వారికి, నన్ను ఈ స్థాయికి చేర్చిన వారికి ధన్యవాదాలు. మలయాళ చిత్రపరిశ్రమ నన్ను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టింది. నాకు నటించడం తెలియదంటూ కామెంట్స్ చేశారు. ఆ సమయంలో అనేక ట్రోల్స్ ఎదుర్కొన్నాను. అయినా ఎన్నడూ అధైర్యపడలేదు' అని చెప్పుకొచ్చారు.



సీయూబీకి 'డిజిటల్ పేమెంట్స్' అవార్డు

అడయార్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో రెండో అతిపెద్దదైన సిటీ యూనియన్ బ్యాంకు (సీయూబీ) డిజిటల్ పేమెంట్స్ రంగంలో ప్రతిష్టాత్మక అవార్డును సొంతం చేసుకుంది. ఈ అవార్డును కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతులు మీదుగా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ ఎస్.కామకోడి స్వీకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. కాగా, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం (డిపార్టుమెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్) డిజిటల్ పేమెంట్స్‌లో అత్యుత్తమ సేవలందించే బ్యాంకులను ఎంపిక చేసి 'డిజిటల్ పేమెంట్స్ అవార్డు'లను ప్రదానం చేస్తోంది. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిజిటల్ పేమెంట్స్ సేవల్లో సీయూబీ ఈ అవార్డును సొంతం చేసుకుంది. కాగా, 1904లో స్థాపించిన ఈ బ్యాంకు దేశంలోని అతిపురాతన ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటిగా ఉన్న విషయం తెల్సిందే.


కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న సీయూబీ సీఎండీ డా.ఎస్, కామకోడి

వేడుకగా హిందుస్థాన్ గ్రూప్ వ్యవస్థాపక దినోత్సవం


వేడుకల్లో నిర్వాహకులు

పెరంబూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హిందుస్తాన్ గ్రూపు సంస్థల 85వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. చెంగల్పట్టు జిల్లా పదూర్‌లో వున్న 'హిట్స్' ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి మనో తంగరాజ్ ముఖ్య అతిథిగా, మలంకర మార్‌థోమా సీరియస్ చర్చి బిషప్ రెవరెండ్ డాక్టర్ గ్రెగోరియోస్ మార్ స్టెఫనోస్ ఎపిస్కోపా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మనో తంగరాజ్ మాట్లాడుతూ.. 8 దశాబ్దాలకు పైగా తమిళనాడు విద్యారంగంలో హిందూస్తాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఒక మూలస్తంభంగా వున్నాయని, వ్యవస్థాపకులు డాక్టర్ కేసీజీ వర్గీస్ సమ్మిళిత విద్య, వ్యక్తిత్వ నిర్మాణం యొక్క తత్వశాస్త్రం నాణ్యమైన విద్య ద్వారా ప్రతి పౌరుడినీ శక్తివంతం చేయాలనే మన రాష్ట్ర దార్శనికతకు సరిపోతుందన్నారు. కొత్తగా ఏర్పాటైన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ ఎన్‌వవర్‌మెంట్ నిస్సందేహంగా తమిళనాడు జ్ఞాన ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. హిందూస్తాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ కేసీజీ వర్గీస్ మెమోరియల్ స్కాలర్‌షిప్‌ను ప్రదానం చేశారు.

అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఎముకల ప్రత్యేక చికిత్సా విభాగం


ప్రత్యేక చికిత్సా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న చిన్నారులు, వైద్యనిపుణులు

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో పీడియాట్రిక్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రోమా కేర్ పేరుతో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఎముకల చికిత్స కేంద్రాన్ని గురువారం ఉదయం ప్రారంభించింది. బాలబాలికలు ఆడుకునే సందర్భంగా ఎముకలకు గాయమైతే ఈ కేంద్రం ద్వారా అత్యవసర చికిత్స అందిస్తామని అపోలో హాస్పిటల్స్ చెన్నై రీజియన్ సీఈవో డాక్టర్ ఇలన్ కుమరన్ కలియమూర్తి తెలిపారు. ఈ కేంద్రంలో చిన్నారులకు ఎముకల చికిత్స చేసే ప్రత్యేక పరికరాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఆర్.శంకర్ తదితర వైద్యనిపుణులు పాల్గొన్నారు.


డీఎంకే నాలుగేళ్లపాలనపై ఎగ్మూరు తాళముత్తు నటరాజన్ మాళిగైలో గురువారం ఏర్పాటైన ఫొటో ప్రదర్శన ప్రారంభించి, అక్కడి సిబ్బందితో గ్రూపు ఫొటో దిగిన సీఎం స్టాలిన్


లండన్‌లో వాతావరణ మార్పులపై జరిగే సదస్సుకు ఎంపికైన డీఎంకే ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ గురువారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న దృశ్యం


ఆదిశేషుడు

రామనాథపురం జిల్లా.. రామాయణ కావ్యంలోని కీలకమైన ఘట్టాల ఆవిష్కరణ క్షేత్రాలకు నెలవుగా ఉంది. ఆ జిల్లాలోని తిరుపుల్లాని ఆది జగన్నాథుడి ఆలయం శ్రీరాముడి జననానికి, రామసేతు నిర్మాణానికి కారణమైన అద్భుతమైన వైష్ణవ దివ్య దేశంగా కీర్తి చెందింది. ఈఆలయం కూడా ఎన్నో అద్భుతాలకు నెలవు. ఎన్నో తీర్థయాత్రలు చేసిన దశరథుడు చివరకు ఈ ఆలయంలో పుత్రకామేష్టి యాగం చేసి సంతానం పొందిన దివ్యదేశమిది. సీతం కోసం లంకకు వెళ్తున్న శ్రీరాముడు ఇక్కడి సేతుకరైలో సముద్రంపై వంతెన నిర్మించేందుకు సముద్రరాజు అనుగ్రహం పొందడానికి దర్భపై శయనించిన క్షేత్రం కూడా ఇదే. ఈ ఆలయంలో శ్రీరామచంద్రమూర్తి ధర్భచాప వేసుకుని ఆదిశేషుడిపై శయనిస్తూ భక్తులను అనుగ్రహించే అరుదైన వైష్ణవ క్షేత్రంగాను పేరొందింది. నరసింహస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై దర్శనమిచ్చే ఆలయం కూడా ఇదే! ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ ఆలయ సమాహారం నేటి ఆధ్యాత్మికంలో...

\- టి.నగర్, ఆంధ్రజ్యోతి


తిరుపుల్లాని ఆలయ రాజగోపురం

ఆధ్యాత్మికం

అద్భుతాలకు నెలవు ఆది జగన్నాథుడి కొలువు

● అద్భుతమైన వైష్ణవ దివ్యదేశం దర్భశయనం
● దశరథుడు, శ్రీరాముడు దర్శించిన దివ్యదేశం
● పుత్రకామేష్ఠియాగం, రామసేతు నిర్మాణ క్షేత్రం


శ్రీరామచంద్రమూర్తి


చక్రతీర్థం

స్థలపురాణం... : పూర్వం పుల్లవర్, కాలవర్, కణ్ణవర్ అనే మహర్షులు దర్భారణ్య ప్రాంతంగా ఉండే ప్రస్తుతం ఆలయం ఉన్న తిరుపుల్లాని అరణ్యంలో మహావిష్ణువు కోసం తపమాచరించారు. ఆ మునిపుంగవులు తపస్సు చేస్తుండగా అసురులు వారిని హింసించారు. వారి బారి నుండి తమను కాపాడమంటూ మహర్షులు మహావిష్ణువును వేడుకున్నారు. వారి మొరాలకించి మహావిష్ణువు తొలుత రావిచెట్టు రూపంలో వచ్చి వారిని కాపాడి, ఆ తర్వాత శంఖు, చక్రధారిగా అభయముద్రతో 'ఆది జగన్నాథుడిగా ప్రత్యక్షమై వారికి ముక్తినొసంగిన పుణ్యస్థలమే ప్రస్తుతం తిరుపుల్లానిలోని దివ్యదేశం. అమ్మవారైన పద్మాసినికి ప్రత్యేక సన్నిధిఉంది. పెరుమాళ్ మంగళాశాసనం పొందిన అష్టోత్తర శత దివ్యదేశాల్లో ఆది జగన్నాథుడి ఆలయం ఒకటి. శ్రీరాముడు శయనభంగిమలో దర్శనమివ్వటం ఈ క్షేత్రం ప్రత్యేకాంశం. తిరుమంగై ఆళ్వార్ తనను పడతిగా భావించుకుని ఇక్కడి పెరుమాళ్‌ను కీర్తిస్తూ మంగళాశాసనమొనర్చారు. అంతేకాకుండా ఆండాళ్, తిరుమళిసై ఆళ్వార్, కులశేఖరాళ్వార్లు ఈ ప్రాంతంలోనే సేతు (వంతెన) గొప్పదనాన్ని కీర్తించారు.పూరి క్షేత్రంలో అర్ధభాగం మాత్రమే దర్శనమిచ్చే జగన్నాథుడు ఈ క్షేత్రంలో సంపూర్ణంగా దర్శనమిస్తుండటం విశేషం. కనుకనే ఈ క్షేత్రానికి దక్షిణ జగన్నాథపురం అనే పేరు కూడా ఉంది. 'పుల్లారణ్యం' (దర్భారణ్యం), 'దర్భశయనం' అనే నామాలతోనూ ఈ ఆలయాన్ని పిలుస్తున్నారు. ఈ ఆలయంలో స్వామివారు, ఆదిజగన్నాథుడిగా (ఆశీన భంగిమలో), శయనరాముడిగా (కిడన్త కోలమ్, శయన భంగిమ) పట్టాభిరాముడిగా (నిలచిన భంగిమ), అరసమర పెరుమాళ్ (రావిచెట్టు పెరుమాళ్), పట్టాభిరాముడు అంటే ఐదు రూపాలు మూడు భంగిమలలో దర్శమిస్తున్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'వృక్షాల్లో నేను వటవృక్షం' అంటూ ప్రకటించుకున్నారు. అంతటి కీర్తిని సంపాదించుకున్న రావిచెట్టు ఈ ఆలయ స్థల వృక్షం. స్వామివారి సన్నిధి వెనుకనున్న అత్యంత ప్రాచీనమైన ఈ రావిచెట్టును భక్తులు సాక్షాత్తూ మహావిష్ణువుగానే భావించి కొలుస్తున్నారు.

మూలవర్లు	ఆదిజగన్నాథుడు, జగన్నాథపెరుమాళ్
ఉత్సవర్లు	కల్యాణ జగన్నాథుడు
అమ్మవారి నామధేయం	కల్యాణవళ్ళి, పద్మాసిని
స్థలవృక్షం	రావిచెట్టు
తీర్థం	హేమ, చక్ర, రత్నాకర తీర్థం
క్షేత్ర పౌరాణిక నామధేయం	తిరుపుల్లనై

శయన రాముడు... : శ్రీలంకలో బందీగా ఉన్న సీతాదేవికి విముక్తి కలిగించేందుకు శ్రీరాముడు కడలిలో సేతువును నిర్మించేందుకు సముద్రరాజు అనుమతి కోరి, మూడు రోజులపాటు ఇక్కడ బసచేశారు. ఆ మూడు రోజులూ ఆయన దర్భచాపపై శయనించారు. ఆ మేరకు ఈ చోట శ్రీరాముడు ఆదిశేషుడిపై దర్భను పరచుకుని మహావిష్ణువులా శయన భంగిమలో దర్శనమిస్తారు. సీతను వెదుకుతూ లంకాపురికి పయనమైనందువల్ల ఈ ఆలయంలో శ్రీరాముని చెంత సీతాదేవి విగ్రహం ఉండదు. ఇక లక్ష్మణుడి రూపంలో ఆదిశేషుడు శ్రీరాముడి వెంటే ఉండటం వల్ల ఆలయంలో లక్ష్మణుడి విగ్రహం లేదు. రామబంటు ఆంజనేయుడి విగ్రహం మాత్రం భక్తులను ఆకట్టుకునేలా దర్శనమిస్తుంది. మూలస్థాన గోష్ఠంలో సేతు (లంకకు వంతెన) నిర్మాణంపై రాముడితో చర్చలు జరుపుతున్న సూర్యచంద్రులు, దేవతలు రూపాలు అందంగా చెక్కబడి ఉన్నాయి.



ధ్వజస్తంభ మండపం

నరసింహస్వామి... : సాధారణంగా మహాలక్ష్మిని వడిలో పెట్టుకుని దర్శనమిచ్చే నరసింహస్వామి ఈ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతుడై భక్తులకు దర్శనమిస్తున్నారు. జగన్నాథపెరుమాళ్ సన్నిధి గోష్ఠంలో లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నారు. భక్తులు ఆ స్వామివారికి చందన తాపడం చేస్తుంటారు. రావణాసురుడిని వధించి సీతాదేవితో కలిసి అయోధ్యకు వెళుతూ శ్రీరామచంద్రమూర్తి రామేశ్వరంలోని రామనాథస్వామివారిని దర్శించిన తర్వాత ఈ ఆలయాన్ని కూడా దర్శించారు. దానికి గుర్తుగా ధ్వజ మండపంలో పట్టాభిరాముడు, సీతా, లక్ష్మణ సమేతుడై దర్శనమిస్తున్నారు. ప్రతి యేటా చిత్తిరై (చైత్ర) మాసంలో ఈ స్వామివారికి బ్రహ్మోత్సవాలు కూడాజరుగుతాయి. సీతాదేవికి విముక్తి కల్పించేందుకు శ్రీరాముడు సముద్రంపై సేతు (వంతెన) నిర్మాణాన్ని ప్రారంభించిన స్థలం 'సేతుకరై' (సేతు తీరం)గా కీర్తింపబడుతోంది. ఈ సేతుకరై తిరుపుల్లానికి 4. కి.మీ దూరంలో ఉంది. ఆ ప్రాంతాన్ని 'రత్నాకర తీర్థం' అని కూడాపిలుస్తారు. సేతు నిర్మాణం కోసం వేడుకున్న శ్రీరాముడికి ఆదిజగన్నాథుడు లంకలో రావణాసురుడిని హతమార్చేందుకు ఓ దివ్యాస్త్రాన్ని కూడా అందించారు. ఇక్కడి ఆదిజగన్నాథపెరుమాళ్‌ను దర్శించుకుంటే తలచిన కార్యాలు నెరవేరుతాయని, శత్రువులపై విజయం సాధిస్తారని చెబుతుంటారు. కనుకనే ఈ స్వామివారిని 'వెట్రిపెరుమాళ్' (విజయాన్ని చేకూర్చే పెరుమాళ్) అని పిలుస్తారు.

ఎలా వెళ్ళాలి? : రాజధాని నగరం చెన్నై నుంచి రామనాథపురానికి రైలు, బస్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రం రామనాథపురం నగరానికి సుమారు 10 కి.మీ.ల దూరంలో ఉంది తిరుపుల్లాని. రామనాథపురం నుండి టౌన్ బస్సులు, టాక్సీలు, వ్యాన్లలో ఈ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 12.15 గంటల వరకు, మళ్ళీ మధ్యాహ్నం 3.30 నుండి రాత్రి 8 గంటలవరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.


శయనిస్తున్న శ్రీరాముడు

సంతానం ప్రసాదించే క్షేత్రం : దశరథుడు సంతానం కోసం ఎన్నో యాగాలు, ధానధర్మాలు చేసినా ఆయనకు సంతాన భాగ్యం కల గలేదు. చివరకు తీర్థయాత్రలు చేస్తూ ఈ క్షేత్రానికి చేరుకున్నారు. ఆది జగన్నాథస్వామి వారిని దర్శించి సంతానం కోసం వేడుకున్నారు. ఆది జగన్నాథస్వామి ప్రత్యక్షమై ఓ మూలమంత్రం చెప్పి, నాగ ప్రతిష్ట చేసి, పుత్రకామేష్టి యాగం చేయమని ఆదేశించారు. ఆ తర్వాత పుత్రకామేష్ఠియాగం ద్వారా శ్రీరామలక్ష్మణ భరత శతృఘ్నులను సంతానంగా పొందారు. సంతాన కోసం దశరథుడు ప్రతిష్ఠించిన నాగలింగం ఆలయంలో నేటికీ దర్శనమిస్తోంది. ఇలా దశరథుడు, శ్రీరాముడు ఆరాధించిన ఆది జగన్నాథ ఆలయాన్ని నూతన దంపతులు సందర్శిస్తే సంతాన భాగ్యం పొందుతారు. నవ దంపతులు వేకువజాము సేతుతీరంలో స్నానమాచరించి, ఆలయానికి వెళ్ళి అర్చకులు ఇచ్చే నాగశిలను పవిత్ర జలాలతో సంప్రోక్షించిన మీదట రాత్రి ఆలయంలోనే జాగారం చేస్తారు. మరుసటి రోజు నాగప్రతిష్ఠ చేసి, పుత్రకామేష్ఠియాగం జరిపిన మీదట ప్రసాదంగా ఇచ్చే క్షీరపాయసాన్ని సేవిస్తే సుపుత్ర ప్రాప్తి కలుగుతుందనేది ఐతిహ్యం.


నాగదేవతలు

ఆలయ విశేషాలు... : ఆది జగన్నాథుడికి పంగుణిమాసంలో, శ్రీరామచంద్రమూర్తికి చిత్తిరై మాసంలోనూ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆ వేడుకల్లో జగన్నాథస్వామి, శ్రీరాములవారు గరుడవాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు.. శ్రీరామనవమి, వైకుంఠ ఏకాదశి, కృష్ణజయంతి, సంక్రాంతి, దీపావళి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.



మూలవర్లు ఆదిజగన్నాథుడు - ఆలయ మండపం

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్‌), జూన్‌ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకున్న మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్‌ పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడులోని బాలుర పాఠశాలలు.. పుదూరు, సూళ్ళూరుపేట, డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరులోని బాలికల పాఠశాలల్లో మిగులు సీట్లకు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25న శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఉన్నతాధికారులు

తిరుపతి(కలెక్టరేట్‌), జూన్‌ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు గురువారం కలెక్టర్‌ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. వీరిలో విభిన్న ప్రతిభాంతులు, వృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వినోద్‌, ఆర్కియాలజీ, మ్యూజియం శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రజిత ఉన్నారు.




కలెక్టర్‌ను కలిసిన వినోద్‌, రజిత


శ్రీహరి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్‌ శిలాతోరణం సర్కిల్‌ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్‌ భక్తులు వేచి ఉన్నారు.


మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,440

తలనీలాలు సమర్పించినవారు: 33,687



ఉగ్రవాదులను ఎదుర్కొంటాం

● తిరుమలలో ఆక్టోపస్‌ మాక్‌డ్రిల్‌

అతిథిగృహం ముందు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది



తిరుమల, జూన్‌ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో బుధవారం అర్ధరాత్రి ఆక్టోపస్‌ మాక్‌డ్రిల్‌ జరిగింది. దేశసరిహద్దుల్లో గతంలో నెలకొన్న యుద్ధపరిస్థితుల నేపథ్యంలో తిరుమల, తిరుపతిలో ఆక్టోపస్‌, పోలీసులు వరుసగా మాక్‌డ్రిల్స్‌ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే పద్మావతి అతిథి గృహంలోనూ మాక్‌డ్రిల్‌ నిర్వహించారు.

మాక్‌ డ్రిల్‌ సాగిందిలా..

పద్మావతి అతిథిగృహంలో ఉగ్రవాదులు ప్రవేశించారని బుధవారం రాత్రి 9.20 గంటలకు తిరుమల టూటౌన్‌ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆక్టోపస్‌ కమాండ్‌ కంట్రోల్‌కు సమాచారాన్ని చేరవేశారు. స్పందించిన ఆక్టోపస్‌ అధికారులు, వివిధ విభాగాల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యంత స్పష్టమైన ప్రణాళికతో మాక్‌ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం ఆక్టోపస్‌ సిబ్బంది ఆయుధాలతో అతిథిగృహం వద్దకు చేరుకుని ఓ అగంతకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు ఉగ్రవాదులను హతమార్చారు. గాయపడిన ఓ సెక్యూరిటీ గార్డును ఆస్పత్రికి తరలించారు. అనుకున్న విధంగానే ఆపరేషన్‌ను ఐదుగంటల్లో పూర్తిచేసి మాక్‌ డ్రిల్‌ను ముగించారు. ఈ ఆపరేషన్‌లో ఆక్టోపస్‌తో పాటు స్థానిక పోలీసులు, రిజర్వ్‌ పోలీసులు, టీటీడీ విజిలెన్స్‌, బాంబ్‌ స్క్వాడ్‌, ఫైర్‌ టీం, మెడికల్‌ విభాగాలు పాల్గొన్నాయి.



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

శాఖల వారీగా భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

● టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల, జూన్‌ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు టీటీడీలో అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ జరిపి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు భక్తుల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్‌పై చర్చించారు. శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందజేస్తున్న సేవలు, లగేజీ, కల్యాణకట్ట, వైద్యం, పారిశుద్ధ్యం, విజిలెన్స్‌, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్‌ తీసుకుంటున్నామని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. బియ్యం, ముడిసరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలన్నారు. వసతి గృహాల్లో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెప్షన్‌, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్‌ఎంఎస్‌ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రద్దీ సమయాల్లో లడ్డూ కౌంటర్‌ వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా పంపిణీ జరగాలన్నారు. రద్దీకి తగినట్టు సిబ్బందిని పెంచాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, కల్యాణకట్టల్లోని భక్తుల వసతులపై అధిక శ్రద్ధ వహించాలన్నారు. తిరుమలలో వసతి బస్సుల సదుపాయ సమాచారాన్ని మైకుల ద్వారా ప్రకటనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి(వర్చువల్‌), జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక హెల్ప్‌లైన్‌

● పెండింగ్‌ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం ● జాతీయ మహిళా కమిషన్‌ సభ్యురాలు డాక్టర్‌ అర్చన మంజుదార్‌ వెల్లడి

తిరుపతి(వైద్యం), జూన్‌ 19 (ఆంధ్రజ్యోతి): 'మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణకు మహిళా కమిషన్‌ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. మీ సమస్యలపై ప్రత్యేక హెల్ప్‌లైన్‌, మెయిల్‌ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. వీటిపై తక్షణమే విచారించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని జాతీయ మహిళా కమిషన్‌ సభ్యురాలు డాక్టర్‌ అర్చన మంజుదార్‌ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ మహిళా అయోగ్‌ ఆప్కేద్వార్‌, మహిళా జన్‌సున్వై కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరకట్నం, సైబర్‌ నేరాలు, లైంగిక నేరాలు తదితర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో పెండింగులో ఉన్న మహిళా కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళల సమస్యలను పరిష్కరించే దిశగా 8 జిల్లాల గ్రీవెన్స్‌కు సంబంధించి ఈ మహిళా జన్‌సున్వై కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌ వెంకటేశ్వర్‌, ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేఖాయ బేగం మెంబర్‌, అడ్వకేట్‌లు కంచి శ్యామల, కోమలాదేవి శారద, నేశమ చౌదరి, చంద్రశేఖర్‌, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంతబాయి, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను డాక్టర్‌ అర్చన మంజుదార్‌ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆమె ఆదేశించారు.



సమస్యను వింటున్న మహిళా కమిషన్‌ సభ్యురాలు డాక్టర్‌ అర్చన మంజుదార్‌, అధికారులు

● ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్‌ సాయిలక్ష్మి సమక్షంలో కొందరు ఆమెకు వినతిపత్రాలను సమర్పించారు. భూ అమ్మకంలో మధ్యవర్తిగా వ్యవహరించినందుకు తిరుచానూరు పోలీసులు హేమలత అనే మహిళపై దాడికి పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు.

● 'తిరుపతి రూరల్‌ మండలం బీటీఆర్‌ అంబేడ్కర్‌ కాలనీకి చెందిన ఆటో కార్మికురాలు భాగ్యశ్రీతో మాట్లాడాలని ఇంటికి పిలిపించి ధనశేఖర్‌ అనే వ్యక్తి మరికొంత మందితో కలిసి దాడి చేశారు. ప్రధాన నిందితుల పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చకుండా పోలీసులు తప్పించారు' అంటూ వినతిపత్రం అందించారు. 15 రోజుల్లోపు వీటిపై విచారించి తమకు నివేదిక పంపాలని పోలీసు అధికారులకు కమిషన్‌ సభ్యురాలు ఆదేశించారు.

ప్రసూతి ఆస్పత్రి తనిఖీ

తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని జాతీయ మహిళా కమిషన్‌ సభ్యురాలు డాక్టర్‌ అర్చనమంజుదార్‌ గురువారం తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. వైద్యసేవల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణ, హక్కులపై అవగాహన కల్పించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పది మంది కంటే ఎక్కువ మంది మహిళలు పని చేసే కార్యాలయాల్లో, సంస్థల్లో ఐసీసీ(ఇంటర్నల్‌ కంప్లైంట్‌ కమిటీ)ని ఏర్పాటు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌ రవిప్రభు, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రాధా, పార్థసారధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లం పాఠశాలలో శ్రీలంక ప్రతినిధులు

ఏర్పేడు, జూన్‌ 19(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యావ్యవస్థ అధ్యయనంలో భాగంగా శ్రీలంకకు చెందిన సుమారు 45మంది విద్యావేత్తలు గురువారం మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బోధనా విధానం, ఉపాధ్యాయల పనితీరు పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో సమకూర్చిన వసతులపై వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. భారతదేశంలో విద్యావ్యవస్థ చాలా పటిష్టంగా ఉందని శ్రీలంక ప్రతినిధులు మహేందర్‌, పెరోరీ కొనియాడారు. శ్రీలంక మహిళా ఉపాధ్యాయులు తమ దేశ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అనంతరం వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌, శ్రీనివాసులు, బాబు, సోమశేఖర్‌, వాణి, విజయ, శేఖర్‌, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏర్పేడు, జూన్‌ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయంలో పలు తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ రమేస్‌ బజ్జూరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు: 1వ తరగతిలో ఎస్టీ 1, సీడబ్ల్యూఎస్‌ఎన్‌ 1, 2వ తరగతిలో ఎస్టీ 1, 3వ తరగతిలో ఎస్టీ 1, 4వ తరగతిలో 26, 5వ తరగతిలో ఎస్సీ 1, ఎస్టీ 1ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైల్వే స్టేషన్‌ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచండి

● రైల్వే జీఎం అరుణ్‌ కుమార్‌ జైన్‌

తిరుపతి(సెంట్రల్‌), జూన్‌19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని సికింద్రాబాద్‌ జోనల్‌ జీఎం అరుణ్‌ కుమార్‌ జైన్‌ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో గురువారం ఆయన తనిఖీ చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఉత్తరం వైపు జరుగుతున్న పనుల్లో ఆలస్యంపై ఆరా తీశారు. నిర్ణీత సమయంలోపు భవనాల నిర్మాణాలను పూర్తి చేసి అప్పగించాన్నారు. ఈ తనిఖీల్లో జోనల్‌, డివిజన్‌ స్థాయి అధికారులు సీఈ కె.సూర్యనారాయణ, డీఆర్‌ఎం చంద్రశేఖర్‌ గుప్తా, మల్లాడి శ్రీనివాస్‌, జి.వామనమూర్తి, డాక్టర్‌ శ్రావణ్‌కుమార్‌, మణికంఠ, స్టేషన్‌ డైరెక్టర్‌ కుప్పాల సత్యనారాయణ, ఎస్‌ఎంఆర్‌ డాక్టర్‌ కె.చిన్నప రెడ్డి, ఎస్‌ఎస్‌ఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెలాఖరుకు జీఎం అరుణ్‌ కుమార్‌ జైన్‌ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా అధికారులు ఘనంగా సన్మానించారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జీఎం అరుణ్‌ కుమార్‌ జైన్‌



సికిల్‌ సెల్‌ అనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

84 వేల మందికి సికిల్‌ సెల్‌ అనీమియా పరీక్షలు

తిరుపతి(వైద్యం), జూన్‌ 19 (ఆంధ్రజ్యోతి): 'సికిల్‌ సెల్‌ అనీమియా.. వారసత్వంగా వచ్చే వ్యాధి. దీని నివారణకు జిల్లాలో విస్తృతంగా స్క్రీనింగ్‌ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి 84 వేల మందికి పరీక్షలు నిర్వహించగా నెగటివ్‌ వచ్చింది' అని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌ తెలిపారు. ప్రపంచ సికిల్‌ సెల్‌ అనీమియా దినం సందర్భంగా గురువారం తిరుపతిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి సికిల్‌ సెల్‌ అనీమియాను పూర్తిగా తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే 1,24,000 మందికి సికిల్‌ సెల్‌ అనీమియాకు స్క్రీనింగ్‌ పరీక్షలు చేయాల్సి ఉండగా.. వీరిలో 84 వేల మందికి పరీక్షలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాస్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూన్‌ 19(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను తీసుకెళ్లిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. తిరుపతి రూరల్‌ మండలానికి చెందిన ఓ 15 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ప్రభు అనే యువకుడు గత నెల 30వ తేదీన బయటకు తీసుకెళ్లాడు. వెంకటగిరిలోని అతడి బంధువుల ఇంట్లో ఉంచాడు. దీనిపై బాలిక తల్లి తండ్రులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో ఆ బాలికను ప్రభు తీసుకెళ్ళినట్లు తెలిసింది. వెంకటగిరికి వెళ్ళి బాలికను తీసుకొచ్చి గురువారం తల్లితండ్రులకు అప్పగించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. త్వరలో అతడిని అరెస్టు చేస్తామని ఎస్‌ఐ చెప్పారు.

కుల ఆధిపత్య రాజకీయాలకు

ప్రత్యామ్నాయంగా ఏఐబీఎస్పీ

● జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

తిరుపతి(ఉపాధ్యాయనగర్‌), జూన్‌ 19(ఆంధ్రజ్యోతి): కుల ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా, బహుజనులను అధికారంలోకి తెచ్చేందుకు ఆలిండియా బహుజన్‌ సమాజ్‌ పార్టీ (ఏఐబీఎస్పీ) ఏర్పాటైందని ఆ పార్టీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో రెండు ఆధిపత్య కులాలే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. బహుజన కులాల్లో చీలికలు తెచ్చి, వారిని తమ వెంట నడిపించుకుంటూ అధికారాన్ని అనుభవిస్తున్నాయి. అందుకని బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్లను ఏకతాటిమీదకు తీసుకొచ్చి వారికి రాజ్యాధికారమే లక్ష్యంగా ఏబీఎస్పీ కృషి చేస్తుంది' అని వివరించారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పదవులు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు కులాల పార్టీలకు రాజకీయసమాధి కట్టి, బహుజన కులాలను అధికారంలో తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి, ఒంగోలు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, విద్యార్థి సంఘం నాయకులు వెంకటస్వామి, బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్‌, ప్రముఖ న్యాయవాది మునయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో గణపతి సచ్చిదానంద

తాపత్రయం వద్దు.. క్రమశిక్షణతో స్వామిని దర్శించండి

● గణపతి సచ్చిదానంద సూచన

తిరుమల, జూన్‌19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తాపత్రయ పడకుండా, క్రమశిక్షణతో దర్శించుకోవాలని దత్తపీఠం గణపతి సచ్చిదానంద సూచించారు. తొక్కిసలాటలకు దూరంగా ఉండాలన్నారు. తిరుమల ఆలయ మహద్వారం వద్దకు గురువారం ఉదయం చేరుకున్న సచ్చిదానందకు టీటీడీ అర్చక బృందం, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికాఫల్‌ స్వాగతం పలికారు. అనంతరం మూలమూర్తిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సాలిగ్రామంగా ఉన్న తిరుమల కొండపై చెప్పులు కూడా వేసుకోకూడదన్నారు. ఒకప్పుడు స్వామి అందరితో మాట్లాడేవారని, క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిన క్రమంలో ఆయన రాయిగా మారి నిలుచుండి పోయారని పేర్కొన్నారు. స్వామి వద్దకు వచ్చి కష్టం చెప్పుకుంటే ఇట్టే తొలగిపోతాయన్నారు. పైసా హుండీలో వేస్తే పది పైసలు స్వామి ప్రసాదిస్తారన్నారు. టీటీడీ యాజమాన్యం కూడా కానుకలను సమర్థంగా వినియోగిస్తోందని అభినందించారు. ప్రస్తుతం యుద్ధ భయం నెలకొని ఉందని, పరమాత్ముడు ఇచ్చిన భూమిపై ఎందుకు కొట్టుకోవాలని ఆయన ప్రశ్నించారు. శాంతిగా ఉండే బుద్ధిని అందరికీ ప్రసాదించాలని కోరుకున్నట్లు చెప్పారు. తాను ఓ ఆలయాన్ని కడుతున్న క్రమంలో స్వామికి చెప్పి ఆశీస్సులు పొందేందుకు వచ్చానన్నారు. భవిష్యత్తులో అమెరికాలోనూ ఆలయాన్ని నిర్మించబోతున్నట్టు వెల్లడించారు.